31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం,ఆగస్టు 26 , 2026 పేజీలు : 8

## జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి

- సర్వే నెంబర్ 138లో అక్రమ నిర్మాణాలు
- 10 నెలలుగా చర్యలు శూన్యం
- సీఎం ప్రజావాణిలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఫిర్యాదు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 26 :** జగిత్యాల మున్సిపాలిటీకి చెందిన సర్వే నెంబర్ 138లోని 20 గుంటల ప్రభుత్వ భూమిలో ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండా, మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై తప్పుడు అనుమతులతో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని కోరుతూ మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి -మిగతా 2లో

# అక్రమాల అడ్డుకట్టకే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్






**చురకలు విలేకరి, గొల్లపల్లి, ఆగస్టు 25:** ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్టంగా తీర్చిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందించాలనే లక్ష్యంతో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి అర్హులైన లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఉన్న నకిలీ, డూప్లికేట్ రేషన్ కార్డులను తొలగించి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన లబ్దిదారులకు మాత్రమే చేరేలా స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 80,873 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, గొల్లపల్లి మండలంలోని 34 రేషన్ షాపుల పరిధిలో 15,185 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి స్మార్ట్ రేషన్ కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను డిజిటల్ విధానంలో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా రేషన్ సరుకులు పొందేలా పోర్టబిలిటీ సౌకర్యం కల్పించామని, పేదలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు రద్దు కాదని స్పష్టం చేశారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల జారీ, వివాహాల అనంతరం కుటుంబ సభ్యుల పేర్ల చేర్పు వంటి ప్రక్రియలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మండలంలో సుమారు 17 వేల స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతలో అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. త్వరలో రెండో విడత ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, 50 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు, తలసేమియా, కిడ్నీ బాధితులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గొల్లపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో తొలి విడతగా డిజిటల్ భూ ఆధార సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం భూ సరిహద్దులు, భూమి మ్యాప్తో కూడిన 'భూ ఆధార' కార్డులను రైతులకు అందజేయనున్నట్లు చెప్పారు. డిజిటల్ భూ సర్వే ద్వారా భూ వివరాలు మరింత స్పష్టంగా, పారదర్శకంగా నమోదు కావడంతో భూ వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 80,873 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు గొల్లపల్లి మండలంలో 15,185 కుటుంబాలకు కార్డులు అందిస్తున్న నేపథ్యంలో, ప్రతి అర్హ కుటుంబానికి కార్డు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో -మిగతా 2లో

## నీట్ పీజీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- ఆగస్టు 30న నీట్--పీజీ పరీక్ష జగిత్యాల జిల్లాలో జేఎన్‌టీయూ కొండగట్టులో పరీక్షా కేంద్రం
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్




**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 25:** ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్-పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వర్షాభావ పరిస్థితులు, నీట్--పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్-పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుందని, అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, జనరేటర్ బ్యాకప్, వెలుతురు, వెంటిలేషన్ తదితర మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని సీఎస్ -మిగతా 2లో

## బదిలీపై వెళ్తున్న ఏవో శశికళకు సన్మానం



**సేవలను కొనియాడిన జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 25 :** జిల్లా పోలీస్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన శశికళ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆమెను ఘనంగా సన్మానించి, ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శశికళ తనకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా, అంకితభావంతో నిర్వహించారని, కార్యాలయ పరిపాలనా వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తూ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేశారని తెలిపారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించారని ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావంతో, వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. కొత్తగా-మిగతా 2లో

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన ఎస్పీ జానకి షర్మిల



**చురకలు ప్రతినిధి, నిర్మల్, ఆగష్టు, 25 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా అడెల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల పాల్గొని మొక్కలు నాటారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా 16.03 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.06 కోట్ల మొక్కలు నాటడం జరిగింది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, సారంగాపూర్ ఎస్ఐ.శ్రీకాంత్ తో పాటు ఫారెస్ట్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వీణవంక హైస్కూల్లో 'వనమహోత్సవం'



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 25 :** వీణవంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం'వనమహోత్సవం' సందర్భంగా ప్రజాప్రతినిధులు,అధికారులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా విద్యార్థులు "పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు" అంటూ నినాదాలు చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దాన్ని బాధ్యతగా సంరక్షించాలని అధికారుల సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి సుధాకర్, ప్రత్యేక అధికారి,సర్పంచ్ దాసారపు సరోజన, ఉప సర్పంచ్ మహేష్ గౌడ్,నీల శ్రీకాంత్, గెల్లు కుమార్, మార్కెట్ డైరెక్టర్ సునీల్, సమిన్ల వేణు, ఐకెపి సిబ్బంది,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్మల్ లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఓ అధికారిపై బదిలీ డిమాండ్

**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 25 :** జిల్లాలో కొందరు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది దీర్ఘకాలంగా ఇదే జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై రైతులు, ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. ప్రత్యేకంగా వ్యవసాయ శాఖలో దీర్ఘకాలంగా ఒకే జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని వారు పేర్కొంటున్నారు. మండల వ్యవసాయ అధికారులు సైతం తమకు అనుకూలమైన ప్రాంతాల్లోనే కొనసాగుతున్నారని, బదిలీల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో రైతులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సేవలు సకాలంలో అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ అంశంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నీట్ పీజీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి

**మొదటి పేజీ తరువాయి....** తెలిపారు. అభ్యర్థుల గుర్తింపు, తనిఖీలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఏఐ గ్లాసెస్, స్పై కెమెరాలు తదితర నిషేధిత వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రత, గోప్యతకు పూర్తి రక్షణ కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆధ్యాత్మిక, చారిత్రక, వారసత్వ, ఎకో టూరిజం, హస్తకళలు, జల పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటిని అనుసంధానిస్తూ పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, కళలు, హస్తకళలు, చారిత్రక వారసత్వం, స్థానిక ఆహారం, పండుగలు, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా బ్రాండ్ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సీఎస్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతం లోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ నిపుణులు సూచించినట్లు సీఎస్ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 కోట్ల ఎకరాల్లో పంటల సాగు జరిగిందని, గత వానాకాలంలో సుమారు 1.38 కోట్ల ఎకరాల్లో సాగు జరిగినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో నీట్--పీజీ పరీక్ష నిర్వహణకు జేఎన్‌టీయూ కొండగట్టులో 2 పరీక్షా కేంద్రములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో మొత్తం 100 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నామని, సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల అడ్డుకట్టకే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటి పేజీ తరువాయి....** పనిచేయా లని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్ర సాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజ నాలు అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. రేషన్ కార్డు భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగపడే ముఖ్యమైన ప్రామాణిక పత్రంగా మారనుందని పేరొ ?కన్నారు. ప్రజల సౌకర్యార్థం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రత్యేక మొబైల్ యాప్ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రేషన్ కార్డు నంబర్ తో డి యాప్ లో లాగిన్ అయి ప్రతి నెలా కేటాయించిన సరుకులు, పొందిన సరుకుల వివరాలను లబ్ధిదారులు స్వయంగా పరిశీలించుకోవచ్చన్నారు. రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే యాప్ ద్వారానే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఏర్పడుతుందని తెలిపారు. డిజిటల్ విధానంతో రేషన్ కార్డుల వివరాలు అందుబాటులో ఉండటం వల్ల లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతాయని పేర్కొన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు పర్యవేక్షణ కొనసాగించా లని, అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ మధు సూదన్, డీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ మాజీద్, ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారు లు,ప్రజలు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తులు కాపాడాలి

**మొదటి పేజీ తరువాయి....**ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 138 లోని 20 గుంటలకు సంబంధించి యాజమాన్య హక్కులు లేకుండా, మున్సిపల్ అధికారుల అండదండలతో కొందరు తప్పుడు అనుమతులు పొంది అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై గతంలో ముఖ్యమంత్రితో పాటు మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్ కు లేఖలు రాశామని, న్యాయ సలహాలు తీసుకుని చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. హామీ ఇచ్చి 10 మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని, అక్రమ నిర్మాణాలు అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు తక్షణమే చర్యలు చేపట్టి, అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని, బాధ్యులైన అధికారులు, నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి తన వినతిపత్రంలో కోరారు.

## బదిలీపై వెళ్తున్న ఏవో శశికళకు సన్మానం

**మొదటి పేజీ తరువాయి...**బదిలీ అయిన ప్రాంతంలో కూడా ఇదే సేవా తత్వంతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఆమె భవిష్యత్ ఉద్యోగ జీవితం మరింత విజయవంతంగా సాగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏవో శశికళ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో పనిచేసిన అనుభవం ఎప్పటికీ మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని, జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం లభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అందించిన సహకారం ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందన్నారు. జగిత్యాల జిల్లాలో సమర్థవంతంగా పనిచేసే అవకాశం రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఇక్కడ పనిచేసిన మధుర స్మృతులతో బదిలీపై వెళ్తున్నందుకు ఆనందంగా ఉందని పేరొ ?కన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఏవో శశికళను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీ చేతన్ నితిన్, సూపరింటెండెంట్లు శ్రీనివాస్, నయీమ్ పాల్గొన్నారు.

## సాగునీటి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విప్ ఆది శ్రీనివాస్ వినతి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 25 :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు సాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన భూనిర్వాసితులకు, ముఖ్యంగా సంకెపల్లి ప్రాంతంలో 18 సంవత్సరాలు నిండిన వారికి, అలాగే దేవాలయాలకు నష్టపరిహారం అందించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.మల్కపేట ప్రాజెక్టు ప్యాకేజీ-9, ఎగువ మానేరు, కుడి, ఎడమ ప్రధాన కాలువల పరిధిలో అవసరమైన చోట భూసేకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఆసిరెడ్డిపల్లి కొచ్చెరువు, సనుగుల ఎర్రచెరువు, పటేల్ చెరువులకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కథలాపూర్ వరద కాలువ 52వ కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం, ఎస్ఆర్ఎస్పీ కాలువపై మాచాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే వరద కాలువ 62వ కిలోమీటర్ వద్ద క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయడంతో పాటు కొండాపూర్--మేడిపల్లి గ్రావిటీ కెనాల్ భూసేకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు.కలికోట సూరమ్మ ప్రాజెక్టు, కాలువల నిర్మాణం కోసం ఇటీవల రూ.80 కోట్ల నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.విప్ ఆది శ్రీనివాస్ వినతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సీఎంను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 25 :** విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ విచ్చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సీఎంతో చర్చించి వినతిపత్రం అందజేశారు. అర్బన్ హౌసింగ్ కాలనీ డబుల్ బెడ్ రూం ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన కోసం గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శన సందర్భంగా ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందని, ఆ ప్రతిపాదనలకు ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. 200 కోట్లతో మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జగిత్యాలలో క్రీడల అభివృద్ధికి హెచ్సిఎ ఆధ్వర్యంలో అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ కు స్థలం కేటాయించాలని, యావర్ రోడ్డు విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, క్యాబినెట్ ఆమోదంతో స్పోర్ట్స్ అకాడమీకి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీఎంకు జగిత్యాల ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**-వర్షాకాలంలో మురికి కాలువల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఆగస్టు 25 :** కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 8అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా పట్టణంలోని అన్నివార్డుల్లో మురికి కాలువలను శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు.ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో మురికి కాలువలు పొంగిపొర్లకుండా వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం చైర్పర్సన్ వసంత తిరుమల మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేంద్ర,వైస్ చైర్పర్సన్, కౌన్సిల్ సభ్యులు,కోఆప్షన్ సభ్యులు,డిప్యూటీ ఈఈ,మేనేజర్, టీపీఓ,ఏఈ,జేఏఓ, ఆర్వో,ఎస్ఐతో పాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఎండి. అమేర్



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 25 :** కోరుట్ల పట్టణంలోని సాహితీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఓ గర్భిణీకి రాత్రివేళ అత్యవసరంగా అరుదైన AB+ రక్తం అవసరం ఏర్పడింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎండి.అమేర్ వెంటనే స్పందించారు.మంగళవారం మెట్పల్లిలోని రాధ్న బ్లడ్ బ్యాంక్కు వెళ్లి 14వసారి రక్తదానం చేసి,గర్భిణీకి అవసరమైన రక్తాన్ని అందించారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన ఎండి. అమేర్ను పేషెంట్ బంధువులు, హాస్పిటల్ సిబ్బంది అభినందించారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.

# రీ- సర్వేను అత్యంత పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 25 :** జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత కార్యాచరణ ప్రకారం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహ సీల్దార్లు,గిర్దావర్లు,గ్రామ పాలనాధికారు లకు గ్రామాల రీ-సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ కమతాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా కొలిచి,భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించడమే రీ-సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రీ-సర్వే ప్రారంభానికి ముందు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, భూ యజమానులు, పట్టాదారులు, రైతులు, ప్రజాప్రతినిధులకు సర్వే కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు,అటవీ భూములు, చెరువులు,కుంటలు,వాగులు, రహదారులు, శ్మశానవాటికలు, ప్రజా అవసరాలకు కేటాయించిన భూములు తదితర సామూహిక ఆస్తులను స్పష్టంగా గుర్తించి రికార్డుచేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో రెవెన్యూ రికార్డులు, పాత గ్రామ పటాలు, సేత్వార్,టిప్పన్, ఖాస్రా పహాణి, ప్రస్తుత భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు మరియు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు.పాత సర్వే నంబర్లు,కొత్త భూ కమతాల మధ్య సంబంధాన్ని తెలియజేసే కోరిలేషన్ స్టేట్మెంట్,ఫీల్డ్ రిజిస్టర్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్, గ్రామ పటం తదితర రికార్డులను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రూపొందించాలని సూచించారు.భూ కమతాల కొలతలు పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలో హద్దులను నిర్ధారించాలని తెలిపారు. అభ్యంతరాలు, క్లెయిమ్లు వచ్చినప్పుడు వాటిని నిర్ణీత గడువులో స్వీకరించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిష్పక్షపాతంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ పాలనాధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, సర్వే బృందాలకు అవసరమైన భూ రికార్డులు, స్థానిక సమాచారం అందించాలని సూచించారు. గిర్దావర్లు రోజువారీ సర్వే పనులను పర్యవేక్షించాలని, తహసీల్దార్లు మండల స్థాయిలో మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. రీ-సర్వే అనేది కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని, గ్రామంలోని ప్రతి అంగుళం భూమికి సంబంధించిన సమగ్రమైన, శాశ్వతమైన మరియు విశ్వసనీయమైన రికార్డును రూపొందించే కీలక కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో రీ-సర్వేకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ, గ్రౌండ్ ట్రూతింగ్, భూ కమతాల కొలత, మ్యాపుల తయారీ, రికార్డుల పరిశీలన, ఫారాలు-రిజిస్టర్ల నిర్వహణ, అభ్యంతరాల పరిష్కారం, తుది భూ రికార్డుల రూపకల్పన తదితర అంశాలను అధికారులకు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ మరియు సర్వే-ల్యాండ్ రికార్డుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాపం సాయికుమార్..!

**-రోడ్డు ప్రమాదంలో విరిగిన రెండు కాళ్లు**

**- కూలీ కుటుంబం...చికిత్స కోసం కొట్టుమిట్టాడుతున్న వైనం**

**-దాతల సహకారం, ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (25) :** రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలో పుట్టిన సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కుమారుడికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన డబ్బులు లేక తల్లిదండ్రులు దాతల సహకారం, ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెలితే నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం కడెం గ్రామానికి చెందిన జైన భీమన్న-సుమలత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జైన సాయికుమార్ (18), చిన్న కుమారుడు జైన సాయికృష్ణ (14). స్వగ్రామంలో జీవనోపాధి లేక బతుకుతెరువు కోసం సుమారు 12 సంవత్సరాల క్రితం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి కూలి పనుల నిమిత్తం వచ్చి అక్కడే స్థిరపడ్డారు. భీమన్న ట్రాక్టర్ డ్రైవర్గా పనిచేస్తుండగా, సుమలత వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.చాలీచాలని కూలీతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో సాయికుమార్ కూడా ట్రాక్టర్ పనులకు వెళ్తూ కుటుంబానికి తన వంతు సహాయం చేసేవాడు.ఈ క్రమంలో పది రోజుల క్రితం ట్రాక్టర్పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో సాయికుమార్ నడుము ప్రాంతంలో తీవ్ర గాయాలై రెండు కాళ్లు విరిగాయి. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయితే మెరుగైన వైద్యం కోసం ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు సూచించారు. ఆపరేషన్కు అయ్యే ఖర్చును భరించే స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు సాయికుమార్ను ఇంటికి తీసు కొచ్చారు.మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్కు తీసుకెళ్లాలని భావిస్తున్నప్పటికీ చేతిలో డబ్బులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు .చికిత్స కోసం దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని భీమన్న, సుమలత దంపతులు చేతులెత్తి వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన దాతలు ఫోన్పే,గూగుల్పే ద్వారా 6302805141 నంబర్కు రాపర్తి దేవేంధర్ ఆర్థిక సహాయం అందించి సాయికుమార్కు అండగా నిలవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది.

# పీఆర్టీయూటీఎస్ ఎండపల్లి మండల నూతన కార్యవర్గం ఎన్నిక



చురకలు విలేకరి ఎండపల్లి ఆగస్టు 25 : పీఆర్టీయూటీఎస్ ఎండపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యలు, వాటి పరిష్కారమార్గాలపై చర్చించారు. ఎన్నికల అధికారి మునిందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా జోగం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా బైరిశెట్టి ధర్మేందర్,అసోసియేట్ అధ్యక్షుడిగా సాయి ప్రశాంత్,మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అరుణశ్రీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు,మహిళా ఉపాధ్యక్షురాలి గా సీహెచ్.శైలజ,మండల కార్యదర్శిగా దెందుకూరి జగన్నాథరావు, మహిళా కార్యదర్శిగా స్రవంతి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మండల ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మామిడి సంతోష్, శ్రీనివాసరెడ్డి, వెంకట్రాం, మేక శ్రీనివాస్, చోటేమియా, శంకర్, సంతోష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు అండగా కోరుట్ల ఎమ్మెల్యే : సంజయ్

**-హైదరాబాద్‌లో ఆశా వర్కర్ల ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే**




**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 25 :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని మెడికల్ కౌన్సిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అండగా నిలిచారు. ఆశా వర్కర్లతో కలిసి ధర్నాలో పాల్గొని వారి సమస్యలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదన్నారు. ముఖ్యంగా కరోనా వంటి కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు విశేష సేవలు అందించిన ఆశా వర్కర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆశా వర్కర్ల హక్కుల పరిరక్షణతో పాటు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్ హామీ ఇచ్చారు.

## బేస్ లైన్ టెస్ట్ పైన మండల స్థాయి సమీక్ష



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (25) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లో బేస్ లైన్ టెస్ట్ పైన.ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి బేస్ లైన్ టెస్ట్ పైన మంగళవారం మండల స్థాయి సమీక్ష సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈసందర్భంగా ఇబ్రహింపట్నం మండల విద్యాధికారి బండారి మధు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి బేస్ లైన్ టెస్ట్ రిజల్ట్ ఆధారంగా ప్రతినెల టార్గెట్ ఎంత శాతం చేరుకుంటారో తెలపాల్సి ఉంటుందని, అందుకని ప్రతి పాఠశాల వారు టార్గెట్ ను చేరుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఇట్టి సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య ,డిస్టిక్ రిసోర్స్ పర్సన్ ప్రవీణ్ ,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన డా.శ్రావణి



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 25 :** అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కార్యకర్తల సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు.ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బోగ శ్రావణి గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బూత్ కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్స్ ఈ-పాస్ విక్రయాల్లో వ్యత్యాసం

**-ఎరువుల దుకాణం లైసెన్స్ సస్పెన్షన్**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 25 :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ములారంపూర్ గ్రామం లో ఉన్న శ్రీరాజరాజేశ్వర్ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణం లైసెన్స్‌ను వ్యవసాయ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు.దుకాణాన్ని తనిఖీ చేసిన సమయంలో యూరియా బుకింగ్ యాప్‌లో నమోదైన బుకింగ్స్,ఈ-పాస్ ద్వారా జరిగిన యూరియా విక్రయాల వివరాల్లో వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.రైతులకు ఎరువుల



పంపిణీలో వ్యవసాయ శాఖ నిర్దేశించిన విధానాలను పాటించకుండా విక్రయాలు జరిపినట్లు తనిఖీల్లో గుర్తించిన నేపథ్యం లో కోరుట్ల ఏడీఏ డి. రమేష్ ఆదేశాల మేరకు మంగళవారం సంబంధిత ఎరువుల దుకాణం లైసెన్స్ ను సస్పెండ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి అకు రాజ్‌కుమార్ తెలిపారు.

**డీలర్లు నిబంధనలు పాటించాలి**

ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని ఎరువుల డీలర్లు వ్యవసాయ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఈ-పాస్ ద్వారా జరిగే ప్రతి ఎరువుల విక్రయాన్ని సక్రమంగా నమోదు చేయాలని, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రిజిస్టర్లు, ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలి.వాస్తవంగా ఉన్న స్టాక్‌కు, రికార్డుల్లో నమోదైన స్టాక్‌కు ఎలాంటి వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.వ్యవసాయ శాఖ నిబంధనలు,ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఎరువుల విక్రయాలు, పంపిణీలో నిబంధనలు ఉల్లంఘించినట్లు, రికార్డులు సక్రమంగా నిర్వహించనట్లు లేదా ఈ-పాస్ వివరాలు, భౌతిక స్టాక్‌లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి హెచ్చరించారు.

# విద్యుత్ శాఖలో "మధుసూదను"డు...

**-విధి నిర్వహణలో స్ఫూర్తి ప్రదాత**

**-ఎక్కడ విధులు నిర్వహించినా మంచి గుర్తింపు**

**-ప్రజలకు,సిబ్బందికి అందుబాటులో ఉండే అధికారి**




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (25) :** విధి నిర్వహణలో అంకితభావం,నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ గౌతమ్ మధుసూదన్ తన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందుతు న్నారు. ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు శాఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ సహోద్యోగులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తున్నారు.విద్యుత్ శాఖలో రైతులకు వినియోదారులకు అందు బాటులో ఉంటూ వేలాదిమందికీ సేవలందిస్తు. ఇబ్బందికి ఎప్పటిక ప్పుడు సలహాలు సూచనలు అందిస్తూ సమర్థవంతమైన పాలనను విద్యుత్ శాఖలో అందిస్తున్న గౌతమ మధుసున్ కథనం...

**నాన్న రాజమల్లయ్య స్ఫూర్తితో...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల పట్టణానికి చెందిన గౌతమ్ రాజమల్లయ్య -- శంకరమ్మ దంపతుల కుమారుడు మధుసూదన్. విద్యుత్ శాఖలో 1969 నుంచి 2005 వరకు సేవలందించి జేఏఓగా పదవీ విరమణ పొందిన తన తండ్రి రాజమల్లయ్యను ఆదర్శంగా తీసుకుని మధుసూదన్ ఉన్నత విద్యను అభ్యసించారు. వరంగల్‌లో డిప్లొమా పూర్తి చేసి, హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ పట్టా సాధించారు.విద్యుత్ శాఖలో ఉద్యోగావకాశాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 1992లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలంలో సబ్ ఇంజనీర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం 1997లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూలపల్లి మండలంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. శాఖాపరమైన పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తూ 2002లో ఏడీఈగా పదోన్నతి పొందారు.సుల్తానాబాద్, కరీంనగర్, హన్మకొండ ప్రాంతాల్లో ఎడిఈ గా సేవలందించిన ఆయన తన సమర్థతతో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం డివిజనల్ ఇంజనీర్‌గా 2017 లో పదోన్నతి పొంది. నిర్మల్ జిల్లా కేంద్రం లో పనిచేశారు. బదిలీ పైన మహబూబాబాద్ జిల్లాకు బదిలీ పైన వెళ్ళారు. 2025లో మెట్‌పల్లి డివిజన్ మళ్ళీ బదిలీ పైన వచ్చి సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నారు.

**ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు...**

విద్యుత్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మధుసూదన్‌కు పలుమార్లు ప్రశంసలు లభించాయి. కింది స్థాయి ఉద్యోగుల పనితీరును సమన్వయం చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. 2025 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు అందించే అభినందన పురస్కారాన్ని కార్పొరేట్ కార్యాలయంలో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెట్‌పల్లి డివిజన్ రాష్ట్రవ్యాప్తంగా నాల్గవ స్థానంలో నిలవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.ఇటీవల ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత తదితర ఉన్నతాధికారుల సమక్షంలో ఉత్తమ అధికారిగా మరోసారి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

**వినియోగదారుల సేవే లక్ష్యం....**

ఉద్యోగ జీవిత ప్రారంభం నుంచి నేటి వరకు ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న మధుసూదన్, వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లో ప్రత్యేక గుర్తింపు పొందారు. సిబ్బందితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ శాఖ ప్రతిష్టను పెంచుతున్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తున్న మధుసూదన్ యువ ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**విద్యుత్ సమస్యలపై సత్వర పరిష్కారం**

**క్షణాల్లో ఫైళ్లపై సంతకాలు..**

విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు వేగంగాస్పందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో పాటు అవసరమైన ఫైళ్లపై సంతకాలను సైతం సత్వరమే పూర్తి చేస్తున్నారని,మెట్‌పల్లి విద్యుత్ శాఖ డివిజన్ ఇంజనీర్ (డీఈ) మధుసూదన్ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, కొత్త కనెక్షన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపుతున్నారు.

**సమస్య చెప్పగానే స్పందన....**

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగానే స్పందన లభిస్తుండటంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన అనుమతులు, ఫైళ్లపై సంతకాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవడం వల్ల పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రజల మన్ననలు....**

విద్యుత్ సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్న డీఈ మధుసూదన్ పనితీరుపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తే ప్రభుత్వ శాఖలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**బాధ్యతాయుతంగా పనిచేస్తే గుర్తింపు ...**

**గౌతమ మధుసూదన్ - విద్యుత్ శాఖ డిఈ మెట్ పల్లి**

నిబద్ధతతో, నిజాయితీగా, బాధ్యతాయుతంగా పనిచేస్తే గుర్తింపు అనేది సహజంగానే వస్తుంది. విద్యుత్ శాఖలో వేలాది మంది రైతులు, వినియోగదారులతో మమేకమై పనిచేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలి. సమస్యల పరిష్కారంలో వేగం, పనిలో పారదర్శకత, ప్రజల పట్ల బాధ్యత ఉంటే సంస్థకు మంచి పేరు వస్తుంది. భవిష్యత్తులో కూడా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.



# దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్తు

**-ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ సిస్టం**
**-సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి**
**-పోస్టర్ ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్ ఆగస్టు,25 :** పేదలపై విద్యుత్ భారాన్ని తగ్గించడం,తద్వారా కర్బన ఉద్ఘరాలు,వాతావరణకాలుష్యాన్ని నివారించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.జైవిక్ కంపెనీ భాగస్వామ్యంలో తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయడానికి మారుతి ఏజెన్సీస్ ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,మారుతి ఏజెన్సీస్ నిర్వాహకుడు తిప్పారపు ఆంజనేయులు, ఆ సంస్థ ప్రతినిధులు దేవోజు వెంకటరమణాచారి,తిప్పారపు రవివర్మ లతో కలిసి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం పోస్టర్లను మంగళవారం ఇక్కడ ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 2027 మార్చి నాటికి దేశంలోని కోటి కుటుంబాలకు సౌర విద్యుత్ అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తున్నదని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ గా ఆయన అభివర్ణించారు.ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి సగటున రూ.77,800సహాయం అందుతుందన్నారు.ఒక కిలో వాట్ వరకు రూ.30,000,రెండు కిలోవాట్లకు రూ. 60000, మూడు కిలోవాట్లకు 78 వేల సబ్సిడీ లబ్ధిదారులకు లభిస్తుందన్నారు.ఈ పథకం ద్వారా తమ గృహాలకు అవసరమైన విద్యుత్తును వాడుకొని మిగిలిన విద్యుత్తును లబ్ధిదారులు డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ పథకానికి సంబంధించిన వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన మారుతి ఏజెన్సీస్ నిర్వాహకులను కోరారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**-మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఆగస్టు 25 :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు.మంగళవారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా మానకొండూర్ నియోజకవర్గంలో వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా పంచాయతీ ఆవరణలో పలు మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు,వర్షపాతం అసమతుల్యత వంటి సమస్యలకు పర్యావరణ కాలుష్యం కూడా ఒక కారణమని పేర్కొన్నారు.భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.పర్యావరణ సమతుల్యతను సాధించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తికాదని,వాటిని కాపాడి పెంచినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు,యువత,మహిళలు, విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి పచ్చదనాన్ని పెంపొందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు.మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, భూగర్భ జలాల పరిరక్షణకు కూడా దోహద పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వన మహోత్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, నుస్తులాపూర్ పాక్స్ చైర్మన్ మొరపల్లి రమణారెడ్డి,ఎంపీడీవో నంగునూరు రాజీవ్ మల్హోత్రా,ఎంపీఓ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్,ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి,జి పి ఏపీఎం సంపత్,ఫారెస్ట్ జిల్లా రేంజ్ ఆఫీసర్, డీఆర్ఓ కిరణ్మయి, చైతన్య ఆనంద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అన్వర్ హుసేన్, మాజీ ఎంపీపీలు కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, అల్లాడి రఘునాథరావు,బైరి చంద్రమౌళి, గోపు మల్లారెడ్డి,మామిడి అనిల్ కుమార్,బుధాకరు శ్రీనివాస్, కమలాకర్, కనకమల్లు, కొండల్ రెడ్డి, అంకూస్,పోతుగంటి శ్రీనివాస్,ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్, మాత్మ నగర్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను అరికట్టడంలో గ్రామస్తులు ముందు ఉండాలి

**-కోర్కల్ గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ అవగాహన**
**-జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్**



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 25 :** వీణవంక మండల పరిధిలోని కోర్కల్ గ్రామంలో మంగళవారం జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతిలు కమ్యూనిటీ పోలీసింగ్,పలు అంశాల పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలి.సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులను నమ్మవద్దు. ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు చూడాలని నేను ఏదైనా తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తాం.బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలను ప్రోత్సహించవద్దు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో సైకిలింగ్ చేస్తూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ , ఫిట్‌నెస్ తో పాటు సామాజిక బాధ్యతపై గ్రామ యువతకు అవగాహన కల్పించారు.

## ఏఈని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్యోగులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆగష్టు 25 :** ఎల్లారెడ్డిపేట మండల ఇందిరమ్మ ఇళ్ళ గృహనిర్మాణ సంస్థ ఏఈ జక్కని చైతన్యను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా మండల పరిషత్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ఇందిరమ్మ ఇళ్ళ గృహ నిర్మాణ సంస్థలో పట్టుదలతో పనిచేసిన చైతన్య బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును పంద్రాగస్టు సందర్భంగా ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ అగ్రవాల్ చేతుల మీదుగా అందుకున్న శుభ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మండల పరిషత్ ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు ఆధ్వర్యంలో సర్పంచుల పోరం మండలం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య ఎఎంసి వైస్ ప్రసిడెంట్ గుండాడి రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరిధర్ రెడ్డి, బండారి బాల్ రెడ్డి గుర్రాల రాజిరెడ్డి ద్యాగం లక్ష్మీనారాయణ బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు గ్రహీత చైతన్య కు శాలువాలు కప్పి అభినందించారు.

## వన మహోత్సవంలో పచ్చదనానికి శ్రీకారం

**-సర్పంచ్ ఎలుక ఆంజనేయులు**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఆగష్టు 25 :** తిమ్మాపూర్ మండలం రేణికుంట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సర్పంచ్ ఎలుక అంజనేయులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలు నాటడం అంటే కేవలం పచ్చదనం పెంచడం మాత్రమే కాదు మన భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే బాధ్యతను తీసుకోవడ అని అన్నారు. ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటికి క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. పచ్చదనం పెంపొందించడంలో గ్రామ ప్రజలు, విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారుఈ రోజు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు జీవనాధారం. మొక్కను నాటడమే కాదు.. అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించడం మన అందరి బాధ్యత” అని సర్పంచ్ ఎలుక అంజనేయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం సర్పంచ్ ఎలుక అంజనేయులు ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి వార్డు సభ్యులు కొర్రి వంశీ కనపర్తి చంద్రశేఖర్ బోయిని శంకరయ్య,మరియు మాజీ కోఆప్షన్ సభ్యులు బిరం మహేశ్వరి మాజీ ఉపసర్పంచ్ బావండ్ల రాజయ్య బొంగాని రమేష్ మహిళా మండల సమైక్య సంఘం,సి.సి చంద్రమౌళి సి. ఏ శ్రీధర్ శ్రీలత, స్కూల్ హెచ్.ఎం శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, మరియు ఉపాధ్యాయులు,మాహిళా సంఘ సభ్యులు గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 25 :** మెట్ పల్లి మండల ఆత్మకూర్ గ్రామాల్లో మాకునూరి రోషిత్(27) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో ఒక్కసారిగా గ్రామంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..రోషిత్ అనే యువకుడు కి మూడు సంవత్సరాల క్రితం వివాహం అవ్వగా పిల్లలు కాలేదాని మనస్థాపంతో తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకొని చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.దింతోగ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతుదేహాని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపి తండ్రి రమేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అక్కపల్లిలో ఇంటి ఇంటికి మొక్కలు పంపిణీ



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆగస్టు 25 :** ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ప్రారంభించారు, ఈ కార్యక్రమం భాగంలో సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ఉపసర్పంచ్ మందాటి బాబు పంచాయతీ సెక్రటరీ దేవేంద్ర వార్డు మెంబర్లు వర్కు టి రాజు సుంకరి రవికాంత్ మందాటి పావని బాల మల్లేష్ పిట్టల లక్ష్మి మోహన్ ఫీల్డ్ అసిస్టెంట్ రాపోలు గణేష్ తదితరులు పాల్గొన్నారు అనంతరం సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు ఇంటి ఇంటికి మొక్కలు పంపిణీ చేశారు.సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు మాట్లాడుతూ మొక్కలను పెంచడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా గ్రామస్తులు తీసుకోవాలన్నారు.మొక్కలు పెరిగి వృక్షాలు అయితే భావితరాలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

## వైద్య సేవలపై కాంగ్రెస్ నేత అసంతృప్తి

**-వావిలాల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 25 :** జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ మంగళవారం సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళు_న్నామని, పేదలకు అందించే వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్, మండల అధ్యక్షుడు పరశురామారావు, పొనగంటి మల్లయ్య, సజ్జు, జమ్మికుంట, వావిలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి



**చురుకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 25 :** ఎల్లారెడ్డిపేట మెజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారంస్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామసర్పంచ్ ఎలగందుల నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు చెన్నిబాబు,ఎఎంసి వైస్ ప్రసిడెంట్ గుండాడి రాంరెడ్డిలు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలు ప్రభుత్వం అందించే రేషన్ సౌకర్యాలను మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి , కృష్ణ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు 100 గిరిధర్ రెడ్డి,రాములు బండారి బాల్రెడ్డి నంది కిషన్,చందు,వంగ శ్రీకాంత్ రెడ్డి, పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్,ముద్దుల శ్రీపాల్ రెడ్డి పద్మా రెడ్డి,బిపేట రాజ్ కుమార్, వద్నాల వెంకటేష్ వార్డు సభ్యులు, రేషన్ డీలర్లు కిషన్, బాబా సుంకరి రాజయ్య గ్రామపంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మునిసిపాలిటీకి నిధులు కేటాయించండి

**-మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లతో కలిసి మంత్రి పొన్నంను కలిసిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 25 :** హుజురాబాద్ మునిసిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని, కౌన్సిలర్లు మంగళవారం సైదాపూర్ మండలం ఆకునూరు గ్రామానికి వచ్చిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. మున్సిపాలిటీ ఆదాయ అయాయాలను ఈ సందర్భం గా వారు మంత్రికి వివరించారు. మునిసిపాలిటీ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, అలాగే కొత్త అభివృద్ధి కార్యక్రమాలు ఆయా అవార్డుల్లో చేపట్టాల్సి ఉందని వివరించారు. వరంగల్ కరీంనగర్ ప్రధాన రహదారి విస్తరణ చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని కోరారు. స్థానిక ఇరిగేషన్ అండ్ బండ్స్ (ఐబి) అతిథి గృహం ఆవరణలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అర్ధాంతరంగా నిలిచి పోయిందని దాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కెసి క్యాంపులో ఇంటిగ్రేటెడ్ ఆఫీసెస్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. శివారు గ్రామాల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయని సిసి రోడ్లు డ్రైనేజీలు అవసరం ఉన్నాయని వాటికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలో సుందరీకరణ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుజురాబాద్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. తప్పకుండా త్వరలోనే హుజురాబాద్ కు వస్తానని, సమస్యలను స్వయంగా పరిశీలిస్తానని, రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి పొన్నం ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు తెలిసింది. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్లు సందమల్ల బాబు,వద్లూరి శ్రీలేఖ,కోయల్ కార్ భారతి,తదితరులు ఉన్నారు.

# పచ్చదనమే ప్రగతికి సోపానం

**-గురుకుల పాఠశాలల ఆర్‌సీవో అంజలీదేవి**

**-హుజూరాబాద్ ఎంజేపీ గురుకులంలో వనమహోత్సవం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 25 :** పర్యావరణ సమతుల్యతను కాపాడటం అందరి బాధ్యత అని, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు మొక్కలు నాటాలని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారిణి (ఆర్‌సీవో) అంజలీదేవి పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో మంగళవారం 'వనమహోత్సవం' వేడుకలను అధ్యాపకులు సిబ్బందితో కలిసి నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శారదతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్ సి ఓ మాట్లాడుతూ.. మానవ మనుగడకు వృక్షాలే ప్రాణాధారమని, విచ్చలవిడిగా చెట్లను నరకడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణను అలవాటుగా మార్చుకోవాలని, నాటిన ప్రతి మొక్కను సొంత బిడ్డలా సంరక్షించాలని కోరారు. ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. పాఠశాలలో నిరంతరం హరిత వాతావరణం ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, పర్యావరణ పరిరక్షణలో తమ విద్యార్థినులు ఎప్పుడూ ముందంజలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఓమౌజయా: ప్రజ్ఞాన క్షేత్రంలో

# శ్రావణ మాస ఏకాదశి వసుదైక కుటుంబ వేడుకలు

**- ఓమౌజయా: విశ్వ మహిళా సేవా సమితి వరల్డ్ రికార్డ్స్ ఇండియా బుక్ లో నమోదు**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 25 :** శ్రీ శ్రీ శ్రీ పరమ పూజ్య ప్రేమమయ మహాగురు వారి దివ్యానుగ్రహముతో ఓమౌజయా: ప్రజ్ఞాన క్షేత్రంలో ఒక వెయ్యి మూడు మంది సీనియర్ సిటిజన్ మహిళలకు చీరలను పంపిణీ చేయడం ద్వారా ఓమౌజయా: విశ్వ మహిళా సేవా సమితి పేరు వరల్డ్ రికార్డ్ ఇండియా బుక్‌లో నమోదయింది.ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామ శివారులోని ఓమౌజయా: ఆశ్రమంలో శ్రావణ మాస ఏకాదశి సందర్భంగా వసుధైక కుటుంబ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 13 వ వార్షికోత్సవం సందర్భంగా సహస్ర కుంకుమార్చన, సహస్ర కలశ అర్చన, సహస్ర దీపారాధన, శక్తిపీఠం మహామాత ర్యాలీ, శ్రీ ప్రభు పల్లకి, ఉచిత అన్నదానం లడ్డు ప్రసాదము వితరణ తదితర కార్యక్రమాలు కన్నుల పండగగా జరిగాయి.అంతేకాకుండా, 50 సంవత్సరాలు పైబడిన 1003 మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంకు వరల్డ్ రికార్డ్స్ ఇండియా సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఇంత పెద్ద ఎత్తున సీనియర్ సిటిజన్ మహిళలకు సేవాభావంతో చీరల పంపిణీ చేయడం అనేది గొప్ప విషయమని కొనియాడారు.శ్రీ శ్రీ శ్రీ పరమ పరమ మహాగురు ద్వారా స్థాపించబడిన సంస్థ ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండడం అభినందనీయమన్నారు. పెద్ద ఎత్తున మహిళలకు చీరలు పంపిణీ చేయడం ద్వారా విశ్వ మహిళా సేవాసమితి వారు రికార్డు నెలకొల్పారని , వారి పేరు వరల్డ్ రికార్డ్స్ ఇండియాలో నమోదైనట్లు తెలుపుతూ సర్టిఫికెట్ ప్రధానం చేశారు.కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్, నిజామాబాద్, విజయవాడ, వరంగల్ జిల్లాల నలుమూలల నుండి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదము మరియు లడ్డు వితరణ చేశారు.



గ్రామీణ పేదప్రజలకు

# మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-ధర్మారంలో పి ఎచ్ సి, అంగన్వాడి నూతన భవనాలు ప్రారంభం**

**-స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేసిన రాష్ట్ర మంత్రి అడ్లూరి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 25 :** గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన సేవలు అందించడ మే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మన్ కుమార్ స్పష్టం చేశారు.ధర్మపురి నియోజక వర్గం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో సుమారు రూ.1.56కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం,12 లక్షల వ్యయంతో నిర్మించి నఅంగన్వాడిభవనాన్నిమంగళవారం మంత్రి అడ్లూరి ప్రారం భించి, మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం అందు బాటులోకి రాగా మండల ప్రజలకు వైద్య సేవలు సులభ తరం కానున్నట్లుపేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని మంత్రి అడ్లూరి స్పష్టంచేశారు. ధర్మారం మండల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజా ప్రతినిధులు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,వైద్య సిబ్బంది,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ సివిల్ జడ్జి లావణ్యకు ఘన సన్మానం

**-వెయ్యికి పైగా కేసులు పరిష్కరించి జడ్జి లావణ్య న్యాయం అందించారు**

**-ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్నా పద్మావతి**

జగిత్యాల, ఆగస్టు 25 : జగిత్యాలలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన లావణ్య కక్షి దారులకు న్యాయశీ అందించారని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్న పద్మావతి కొనియాడారు. జగిత్యాల జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న లావణ్యకు జగిత్యాల బార్ అసోసియేషన్ మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రత్నా పద్మావతి మాట్లాడుతూ... లావణ్య అనతి కాలంలోనే వెయ్యికి పైగా కేసులను పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించారని కొనియాడారు. ఉద్యోగంలో బదిలీలు సహజమని, పదోన్నతి పొందడం ఎంతో సంతోషం గా ఉందని, అయితే జగిత్యాల నుండి బదిలీపై వెళ్తుండడం బాధగా ఉందని ఆమె అన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరో హించాలని ఆకాంక్షించారు. అనంతరం న్యాయవాదులు లావణ్యకి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.



నాగేశ్వర్ రావు, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిఖిషా గారు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, ఉపాధ్యక్షులు మర్రిపెల్లి సత్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి అందే మారుతి, న్యాయవాదులు రాచకొండ శ్రీరాములు, బండ భాస్కర్ రెడ్డి, డబ్బు లక్ష్మారెడ్డి, ముదిగంటి జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు,పెండెం మహేందర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులను అభినందించిన జిల్లా ఎస్పీ

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 25 :** జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో జరిగిన వృద్ధురాలి మృతి కేసును జగిత్యాల రూరల్ పోలీసులు కేవలం 4 గంటలలో ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తులో కీలకమైన ఆధారాలను పోలీసులకు అందించి సహకరించిన తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దోమల రవి, దోమల గంగాధర్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తించి ఇద్దరికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేరాల ఛేదనలో



పోలీసులకు ప్రజల సహకారం ఎంతో కీలకమన్నారు. గ్రామాల్లో లేదా పరిసర ప్రాంతాల్లో ఏదైనా నేరం జరిగినా, అనుమానాస్పద సంఘటనలు గమనించినా లేదా నేరానికి సంబంధించిన సమాచారం తెలిసినా ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలు సకాలంలో అందించే సమాచారం నేరాల నియంత్రణతో పాటు కేసుల దర్యాప్తులో కూడా కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ కేసులో దోమల రవి, దోమల గంగాధర్ అందించిన బైక్ కు సంబంధించిన ఫోటో ఆధారాలు పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయని ఎస్పీ పేర్కొన్నారు. కేసు ఛేదనలో విలువైన ఆధారాలను అందించి పోలీసులకు సహకరించిన దోమల రవి, దోమల గంగాధర్ లను ఎస్పీ అభినందిస్తూ, ప్రతి పౌరుడు పోలీసులతో సమన్వయం తో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఏదైనా నేరం జరిగినప్పుడు లేదా నేరానికి సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్, ఎస్.ఐ ఉమా సాగర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ సి.ఐ సుధాకర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు ఉచిత యూనిఫాంల పంపిణీ

**-ప్రభుత్వ సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి**

**-అన్నం లావణ్య అనిల్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఆగస్టు,25 :** పట్టణంలోని 26వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు నూతన ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్ హాజరై చిన్నారులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఇందులో భాగంగానే చిన్నారులకు ఉచితంగా నూతన యూనిఫాంలను అందజేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఉచిత విద్యా సామగ్రి,దుస్తులు అందిస్తున్నందున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వాణి,శారద,చిన్నారులు,వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు,25 :** కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జువ్వాడి నర్సింగరావు కోరుట్ల నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకురావడానికి నిరంతరం ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.



## హెచ్ఐవీ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 25 :** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్ను మంగళవారం అధికారులు విడుదల చేశారు. హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతో పాటు, వ్యాధి నివారణ, ముందస్తు పరీక్షలు, సరైన వైద్య సేవలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు హెచ్ఐవీపై శాస్త్రీయమైన, సరైన సమాచారాన్ని తెలుసుకుని అపోహలకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య అధికారిణి డా. సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఐలు శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేందర్, డీఐఓ నరేంద్ర, డీపీఓ రవీందర్, ఐ.సీ డీఈఎంఓ రవీందర్ రాథోడ్, సూపర్వైజర్ శ్రీనివాస్, డీపీపీఎం హరీష్, ఎస్టీఎస్ ఆంజనేయులు, గిరిధర్, ఫార్మసిస్ట్ తదితరులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలి**

**-పురోగతిలో ఉన్న నిర్మాణ, మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట,ఆగస్టు 25 : విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, స్టోర్ రూమ్ పరిశీలించి, తరగతి గదులు, వసతి, తదితర అంశాలపై వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టి, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. విద్యాలయంలో నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. వంటకు ఉపయోగించే సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. సందర్భంగా సర్పంచ్ మల్లుగారి పద్మ, పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈ లు అన్వర్, సుమలత, ఎంపీడీఓ రాజేందర్, జీసీడీఓ పద్మజ,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ




చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 25 : నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా విని, చట్టపరంగా సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం నమోదు చేసి, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతరం నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, బాలల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. బీట్ వ్యవస్థను పటిష్ఠం చేసి గ్రామాల్లో నిరంతరం పర్యటించాలని, డయల్-112 ద్వారా వచ్చే సమాచారంపై వెంటనే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, ఇతర రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఇట్టి తనిఖీ లో డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొన్నారు

## వృక్ష రక్షాబంధన్‌పై

# విద్యార్థులకు అవగాహన కల్పించిన అటవీ శాఖ




చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 25 : ఈరోజు నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని కొట్ల బీట్ పరిధిలో గల అడెల్లి నందనవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో "వన మహోత్సవ కార్యక్రమం" ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్ఎస్ అర్పణ , కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, బాసర సర్కిల్, గౌరవ అతిథిగా ఎస్పీ.జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు వన మహోత్సవం ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ మరియు జీవ వైవిధ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా అడెల్లి నందనవనంలో మూడు హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టిన ప్లాంటేషన్ కార్యక్రమాన్ని మొక్కలు నాటి ప్రారంభించారు. అనంతరం వృక్షాల ప్రాముఖ్యతను వివరిస్తూ, రాబోయే రక్షాబంధన్ పండుగను "వృక్ష రక్షాబంధన్"గా నిర్వహించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక అటవీ సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులు మరియు మొక్కల నారతో తయారు చేసిన "ప్రకృతి రాఖీ"ని అతిథులు పరిశీలించి, సిబ్బందిని అభినందించారు. తదుపరి విద్యార్థుల చేత "వృక్ష రక్షాబంధన్" కార్యక్రమాన్ని నిర్వహించి, వృక్షాలను సోదరులుగా భావించి వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అతిథులుగా సుశాంత్ సుఖ్దేవ్ బోర్డే, పీడీ విజయలక్ష్మి, నిర్మల్, నాగిని భాను, అటవీ మండలాధికారి, శివకుమార్, అటవీ మండలాధికారి, నిఘా విభాగం, బాసర సర్కిల్,డిఎస్పీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు,జిల్లా అటవీ క్షేత్ర అధికారులు జి.వి.రామకృష్ణారావు,కిరణ్ కుమార్,శ్రీనివాసరావు,రాథోడ్ రమేష్, శ్రీనివాస్ రెడ్డి, గీతారాణి, కల్పనా దేవి, వాణి, నజీర్ ఖాన్,సంతోష్,రాజశేఖర్ ఉప అటవీ క్షేత్ర అధికారులు , అటవీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అంజన్న నామస్మరణతో

# మార్మోగిన కందుగుల



**-"జయ హనుమాన్ జ్ఞాన గుణ సాగర.."**

**-ఏకధాటిగా 12 గంటల పాటు హనుమాన్ చాలీసా పారాయణ**

చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 25 : శ్రావణ మాస మంగళ వారాన్నిపురస్కరించుకొని హుజురాబాద్ మండలం కందుగులలో శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయం జై హనుమాన్ నామస్మరణతో మారు మోగిపోయింది. భక్తులు భక్తి శ్రద్ధలతో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఏకధాటిగా 12 గంటల పాటు హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.స్వామివారికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు.ప్రత్యేక పూజలు చేశారు.గురు నర్సయ్య స్వామి, ఆలయ పూజారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అర్చనలు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భజన బృందం పాడిన పాటలతో భక్తజనం పులకించిపోయింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,భజన బృందాల సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో

# ఘనంగా ఓనం ఉత్సవాలు




చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు, 25 : కేరళలో అత్యంత వైభవంగా జరుపుకునే ముఖ్యమైన పండుగ ఓనం పండుగని, ఇది మహాబలి చక్రవర్తి జ్ఞాపకార్థం మరియు ఆయన ప్రజలపై చూపిన ప్రేమకు ప్రతీకగా భావిస్తారని ఒక గొప్ప నమ్మకం. ఈ పండుగ పంటల పండుగగా కూడా వసిద్ధ చెందినదని పాఠశాల నిర్వాహకులు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఓనం పండుగ పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓనం పంటల పండుగగా కూడా ప్రసిద్ధి చెందినదని, ఇళ్ళ ముందు పూలతో అందంగా పూకలం ఏర్పాటు చేస్తారని అదేవిధంగా పడవల పోటీలు ఓనం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని వారు చెప్పారు.పాఠశాలలో ఓనం పండుగ పురస్కరించుకొని ప్రత్యేక వేడుకలకు విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి వేడుకలకు వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల ద్వారా ఆప్యాయతలతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని వారు చెప్పారు. భారతదేశం అనేక రకాల పండుగలకు గొప్ప నిలయమని మరియు పండగల ద్వారా మన భారతదేశంలో నేటికీ ఐక్యత కొనసాగుతుందని వారు కొనియాడారు. ఓనం పండుగ సందర్భంగా ప్రాంగణాన్ని చాలా చక్కగా అలంకరించి పండుగవాతావరణాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.